క్లుప్తంగా

ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు

నగరి: ''ఇచ్చే జీతాలు సరిపోవడం లేదు, సంక్షేమ పథకాలు కూడా అందడం లేదు. చాలా అవస్థలు పడుతున్నాం. మా విన్నపాన్ని ఆలకించండి మా సమస్యలు పరిష్కరించండి.'' అంటూ మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శనివారం మోకాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఆరవ రోజు మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మేరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీ



సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో భవానీ శంకరి

నగరి: పట్టణంలోని సినిమా థియేటర్లను ఆర్డీఓ భవానీ శంకరి శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. థియేటర్ పరిసర ప్రాంతాల్లో భద్రత, పారిశుధ్యంపై ఆరా తీశారు. అనంతరం పార్కింగ్ ఏరియాను పరిశీలించారు. ప్రేక్షకులకు ఫుడ్ కోర్టులో తినుబండారాల ధరలను తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

నూతన బోరు ఏర్పాటు



పాఠశాల వద్ద వేస్తున్న బోరు

నగరి: మండలంలోని గుండ్రాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నీటి వసతి కోసం శనివారం నూతన బోరు వేశారు. మైదానంలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి మైదానాన్ని చదును చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నీరజారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పప్పుదినుసుల కిట్ సిద్ధం



సిద్ధం చేసి ఉంచిన కిట్లు

నగరి: ప్రకృతి వ్యవసాయ రైతులకు పప్పుదినుసుల కిట్ సిద్ధంగా ఉందని నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎం.కొత్తూరు రైతు సేవా కేంద్రంలో శనివారం ప్రకృతి వ్యవసాయ రైతులకు అవసరమయ్యే పప్పు దినుసుల కిట్‌ను సిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 5 యూనిట్లకు యూనిట్‌కు 40 చొప్పున 200 కిట్లు సిద్ధం చేసి అందిస్తున్నామన్నారు. ఈ కిట్‌లో పప్పుదినుసులు మినుము, పెసర, అలసందలు, రాగులు, సజ్జలు, కొర్రలు, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ అంటూ 25 రకాల విత్తనాలతో కిట్ సిద్ధం చేశామన్నారు. రైతులు ఎం.కొత్తూరు రైతు సేవా కేంద్రం వద్ద వీటిని పొందవచ్చన్నారు.

వ్యవసాయం ఏది బాబూ..?

- కూటమి ప్రభుత్వంలో రైతన్నకు దక్కని సాయం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఇప్పుడు పట్టించుకోని కూటమి
- అదిగో, ఇదిగో అంటూ కాలయాపన
- గతంలో రైతు భరోసా అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- చిల్లిగవ్వలేక అన్నదాతల పాట్లు



వేరుశనగ విత్తనాలు విత్తుతున్న రైతులు

కార్వేటినగరం: కూటమి నేతల మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు. ఖరీఫ్ సాగు మొదలు కాకముందే ఏడాది క్రితం వరకు ఐదేళ్ల పాటు పంటల సాగుకోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయడంతో వ్యవసాయం పండుగలా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు కనీసం సాయం చేయకపోవడంతో ప్రస్తుతం పంటల సాగుకు చేతిలో నగదు లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారమే పరమావధిగా అలవికాని హామీలిచ్చి ప్రస్తుతం వాటిని అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు.

పేరు మార్పుతో సరి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలను ఆదుకునేందుకు రైతు భరోసా పథకం కింద ఏటా ఆర్థిక సాయం అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా పేరు మార్చినప్పటికీ ఏడాది గడిచినా సాయం సంగతి మరిచారు. నాడు ఏటా రైతులకు రూ.13.500 అందేవి. కూటమి పెద్దలు మాత్రం రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా పథకం అమలు ఊసేలేదు.

అదిగో, ఇదిగో అంటూ కాలయాపన

అన్నదాత సుఖీభవ పథకం అమలులో ప్రభుత్వంలో స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా నేటికీ విధి, విధానాలు వెల్లడించకపోవడం చూస్తే పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. ఈనెల 20న అని, కాదు కాదు 21వ తేదీన అని సీఎం చంద్రబాబునాయుడు పలుమార్లు ప్రకటించినప్పటికీ 28వ తేదీ గడిచినా రైతుల ఖాతాలో పథకం సొమ్ము జమ కాలేదు. ఇప్పటికీ అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడంతో అంతంత మాత్రంగానే పంటలు రావడంతో అన్నదాతల చేతిలో చిల్లిగవ్వలేక పంట సాగుకు అప్పులు చేయాల్సి వచ్చింది.

కౌలు రైతులకు దక్కని భరోసా

భూమి లేని రైతులు కౌలుకు భూములను సాగుచేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. అయితే నేడు అవేవి అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకాలన్నింటికీ దూరమై గగ్గోలు పెడుతున్నారు.

నాడు రైతు భరోసా ఇలా...

ఏడాది క్రితం వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు భూసార పరీక్షల నుంచి దిగుబడులను మద్దతు ధరతో కొనుగోలు చేయడం వరకు అండగా నిలిచింది. ఇక ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు జగన్ ప్రభుత్వం పరిహారం అందజేసింది. ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకం కింద ఏడాది రూ 13.500 నగదు సాయం రైతుల ఖాతాల్లో జమ చేసింది.

ఒక పైసా అందలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రైతులకు ఒక పైసా జమచేయలేదు. గత ప్రభుత్వంలో ప్రతి ఏటా రైతుభరోసా పథకం వచ్చింది. విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉండేవి. ఎరువుల కోసం పెట్టే ప్రయాణ ఖర్చులు మిగిలేవి. ఇప్పుడు ఆ ఊసే లేదు.
–రమేష్, రైతు, ఎస్కేఆర్ పురం, పాలసముద్రం మండలం

గత ప్రభుత్వంలో రైతులకు పండుగ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా ప్రతి ఇంటికీ వచ్చింది. పంట సాగుకు ముందే భరోసా నగదు ఖాతాల్లో పడడంతో ఏరువులు, విత్తనాల కొనుగోలుకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేదికాదు. నేడు విత్తన సౌకర్యం లేకుండా దళారుల వద్ద కొనుగోలు చేసి మోసపోతున్నాం.
–టి.బీకమ్మ, మహిళా రైతు, బసివిరెడ్డిపల్లి, శ్రీరంగరాజపురం మండలం

హామీలు విస్మరించారు



రైతుల ఓట్ల కోసం రైతుభరోసాను పేరు మార్చి, అన్నదాత సుఖీభవ పేరు పెట్టి ఇచ్చిన మాట విస్మరించారు. పంటసాగుకు రుణాల కోసం బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ వద్దకు వెళ్లి అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకుంటున్నాం. రైతులకు హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా, కూటమి ప్రభుత్వం సుఖీభవ ఊసే ఎత్తలేదు. మా పరిస్థితి దారుణంగా మారింది.
–పద్మనాభశెట్టి, సురేంద్రనగరం, కార్వేటినగరం మండలం

గెలుపోటములు సహజం



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతిఒక్కరూ విజేతలే అని జీడీ నెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. శనివారం మైనారిటీ యూత్ తాకీర్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్స్, రన్నర్స్‌కు, బెస్ట్ బ్యాట్స్‌మన్, బౌలర్‌క్ కృపాలక్ష్మి నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. సర్పంచ్ ధనంజయవర్మ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి చందురాజు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, పవన్‌కుమార్, శివప్రకాష్ మొదలి, ముస్తాక్, అమాన్‌ఉల్లా, సమీర్, సద్దామ్, సురాజ్, మున్నా, సాధిక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పుత్తూరు: పట్టణంలోని వెంకటేశ్వర హాస్పిటల్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద 50 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. పోలీసుల కథనం.. మృతుడు ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. వంగ పువ్వు కలర్ షర్ట్, నీలి రంగు లుంగీ ధరించి ఉన్నాడు. స్థానికులిచ్చిన సమాచారం మేరకు మృతుడు యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పురవీధుల్లో ద్రౌపదీ అమ్మవారి విహారం



అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: ద్రౌపదీ, ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ద్రౌపదీ అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం దాత మహేశ్వరి, గురుస్వామిరెడ్డి కుటుంబసభ్యులు భక్తులకు ఆలయ ఆవరణంలో అన్నదానం చేశారు. భాగవతారిణి రెడ్డెమ్మ పాండవ విద్యాభ్యాసం కథను భక్తులకు కళ్లకు కట్టినట్లు వినిపించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా వడ్డి కులస్తులు వ్యవహరించారు.

కారు బోల్తా



విజయపురం: మండలంలోని మహారాజపురం వద్ద శనివారం కారు బోల్తా పడింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు శ్రీహరిపురం నుంచి తిరువళ్లూరు వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. అయితే కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

నగరి: మండల స్థాయిలో నిర్వహించిన తల్లికి వందనం పోటీల్లో స్థానిక అక్షర పాఠశాలకు చెందిన విద్యార్థులు రష్మితశ్రీ, గుణశ్రీ, లోహిత్, భరత్ శ్రీదేవ్, చాణక్యలక్ష్మి ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. దీంతో వారు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ఎంఈవో శ్రీదేవి బహుమతులను అందించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ లతా మురళి, ప్రిన్సిపల్ ముగిలన్, ఉపాధ్యాయులు అభినందించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

అవినీతిపరునిపై చర్యలు ఏవీ?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం అండదండలతో అక్రమాలు, అరాచ కాలు చేపడుతూ విచ్చలవిడిగా దోచుకుంటున్న హరీష్‌యాదవ్‌పై చర్యలు లేవా అని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి విమర్శించారు. శనివారం పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు హరీష్‌యాదవ్ క్వారీ యజమాని వెంకటేశ్వర రెడ్డి నుంచి రూ.50 లక్షలు తీసుకున్నట్లు ఆడియో వైరల్ అయినా అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇదంతా ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరుగుతోందని, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. గిట్టుబాటు ధరలు లేక మామిడి రైతులు ఆత్మహత్యలే శరణ్యమంటున్నా, ఎమ్మెల్యే థామస్ మాత్రం విందు, వినోదాలతో కాలం గడుపుతున్నారని విమర్శలు గుప్పించారు. రానున్న రోజుల్లో రైతులు, ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో భర్త అరెస్ట్

పాలసముద్రం : మండలంలోని తిరుమళరాజుపురంలో వివాహితను శుక్రవారం హతమార్చిన కేసు లో ఆమె భర్త కార్తీక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఈ మేరకు సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప వివరాలు వెల్లడించారు. కార్తీక్, ప్రమీలకు 2012లో వివాహమైంది. 2014లో ప్రమీల భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. 2024 లో గ్రామ పెద్దలు ఇరు కుటుంబాలకు నచ్చజెప్పి దంపతులకు రాజీ కుదిర్చారు. అయినప్పటికీ ఇరు వురి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చిన కార్తీక్ డబ్బులు కావాలని ప్రమీలను వేధించాడు. అంతటితో ఆగకుండా కర్రతో తీవ్రంగా కొట్టాడు. దీంత ప్రమీల మృతి చెందింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని చిత్తూరు కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు.

రేపు మున్సిపల్ సమావేశం

నగరి: మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలన్నారు.

గడువులోపు చెల్లించకుంటే అదనపు చార్జీలు

నగరి: విద్యుత్ బిల్లులు ఇచ్చిన 15 రోజుల్లోపు చెల్లించాలని లేకుంటే అదనపు చార్జీలతో చెల్లించాల్సి ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ వెంకటముని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల్లోపు చెల్లిస్తే ఎలాంటి అదనపు చార్జీలు ఉండవన్నారు. ఆపై చెల్లించినవారికే అదనపు చార్జీలు ఉంటాయన్నారు. నెలాఖరులోపు చెల్లించకుంటే మరుసటి నెల 1వ తేదీ నుంచి ఎప్పుడైనా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటికి గానీ, దుకాణాలకు గానీ సర్వీసు తొలగించనున్నట్లు తెలిపారు. తొలగించిన రోజే డబ్బులు చెల్లిస్తే ఆరోజు సాయంత్రమే పునరుద్ధరిస్తామన్నారు. సర్వీసు తొలగించినా ఆలస్యంగా చెల్లిస్తే తాము సూచించే సమయానికి వచ్చి పునరుద్ధరించుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా బిల్లులు సకాలంలో చెల్లించాలని చెప్పారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలకు ఉచితంగా వస్తువుల పంపిణీ



శిక్షణ తరగతులకు హాజరైన మహిళలు

పుత్తూరు: చేతి వృత్తుల్లో శిక్షణతో పాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జేఎస్ఎస్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ సూచించారు. స్థానిక రాస్ కార్యాలయంలో శనివారం జన్ శిక్షణ్ సంస్థాన్ (జేఎస్ఎస్) ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టైలరింగ్, ఆర్య వర్క్‌లో 80 రోజుల పాటు 40 మంది మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు అవసరమైన వస్తువులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఎస్ఎస్ అధికారి హరి, రాస్ అధికారులు రవి, తేజ, మీనా, జయంతి పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నుడి గ్రామోత్సవం



ఊరేగుతున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం అప్పలాయిగుంటలో కొలువైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉభయనాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించారు. వేదమంత్రాలు భక్తుల గోవింద నామస్మరణ నడుమ స్వామి వారి ఊంజల సేవ కొనసాగింది. అనంతరం పద్మావతి అండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.